సాక్షి
వికారాబాద్
ఆదివారం । 24 । మార్చి । 2024




ఈజీఎస్ పనులు వేగిరం

ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆర్థిక సంవత్సరం చివరలో చేపట్టే పనుల్లో అధికారులు నక్సెస్ అయ్యారు. 8లో▸



ఇందిరమ్మ కమిటీల్లో..

తాండూరు నియోజకవర్గంలోని విశ్వకర్మలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



న్యూస్‌రీల్

‘పది’ పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతగిరి: వికారాబాద్‌లోని బ్రిలియంట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం కలెక్టర్ సీ నారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీశారు. క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తరువాతే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించాలన్నారు. దివ్యాంగ విద్యార్థికి సహాయకుడి పరీక్ష రాస్తున్న బాలుడితో కలెక్టర్ మాట్లాడారు.

27న 5కే రన్

- ఓటరు చైతన్యంలో భాగంగా కార్యక్రమం
- తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు



తాండూరు టౌన్: ఓటరును చైతన్యం చేయడంలో భాగంగా ఈ నెల 27న తాండూరు పట్టణంలో 5కే రన్ నిర్వహించనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటలకు స్థానిక ఇందిరా చౌక్ నుంచి సెయింట్ మార్క్స్ పాఠశాల వరకు, అక్కడి నుంచి ఇందిరాచౌక్ వరకు రన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సభ్యులు,వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తు న పాల్గొనాలని ఆర్డీఓ కోరారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా రవీందర్



పూడూరు: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పూడూరు మండలం కంకల్ గ్రామానికి చెందిన రవీందర్ నియమితులయ్యారు. శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ..పార్టీ ఆదేశాలను తప్పక పాటించాలని, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని అన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దల వేడుక రంగుల వేదిక

సంబరాలకు సిద్ధమైన జల్‌పల్లి పిట్టలగూడెం

- ఇక్కడ హోలీకి చాలా ప్రత్యేకత
- ఎక్కడ ఉన్నా.. పండుగకు రావాల్సిందే
- వంశపూజలు ప్రధాన ఘట్టం
- తరలిరానున్న వేలాది మంది నక్కల పిట్టలోల్లు



నిజాం నవాబు నిర్మించిన కొలను

పహాడీషరీఫ్: రంగుల హరివిల్లు హోలీ వేడుకలను జాలీ జరుపుకొనేందుకు జల్‌పల్లి పిట్టల గూడెం సిద్ధమవుతోంది. హోలీ పండుగను పురస్కరించుకొని తెలంగాణ జిల్లాలతో పాటు నగరంలోని అన్ని పార్థివాడలకు చెందిన నక్కల పిట్టలోల్లు ఇక్కడ హోలీ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇంటిల్లి పాది విచ్చేసి నాలుగు రోజుల పాటు ఇక్కడే గడుపుతారు. వేలాదిగా తరలివచ్చే వారితో ఈ ప్రాంతమంతా జాతరను తలపిస్తుంది. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వేడుకలను పురస్కరించుకొని ఇప్పటి నుంచే పిట్టల గూడెంలో సందడి మొదలైంది. తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసుకుంటుండడంతో పాటు తమ పూర్వీకుల సమాధులకు రంగులద్దడంలో నిమగ్నమయ్యారు. ఈ వేడుకల్లో తమ ఆరాధ్య దైవాలు, కుల యువతి అమీర్‌బాయి సమాధికి పూజలు నిర్వహిస్తారు.

పొట్టేళ్లను బలిచ్చి..

వంశపూజలు చేయడం ఈ హోలీ వేడుకల్లో ప్రత్యేక ఘట్టం. హోలీకి ముందు రోజు రాత్రి పెద్ద ఎత్తున కామ దహనం చేసి.. హోలీ రోజున రంగులద్దుకొని స్థానికంగానే ఉన్న జల్‌పల్లి పెద్ద చెరువులో స్నానాలు ఆచరిస్తారు. నక్కల పిట్టలోల్లలో శక్తి, చౌకట్, నౌకడ్, కాలివాలా, ఇస్లీవాలా తదితర వంశాల వారే అధికంగా ఉంటారు. వీరంతా ఇక్కడే వంశపూజ చేస్తారు. ఈ పూజలో ఒక్కో కుటుంబం నాలుగైదు పొట్టేళ్లను బలిచ్చి వేడుకలు జరుపుకొంటారు. దాదాపు వెయ్యి వరకు పొట్టేళ్లను ఈ వేడుకల సందర్భంగా బలివ్వనున్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పహాడీషరీఫ్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణి రెడ్డి పర్యవేక్షణలో నీరు, విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటారు.

సండే స్పెషల్

ప్రాచీన చరిత్ర గూడెం సొంతం

కొన్ని దశాబ్దాల క్రితం వరకు జల్‌పల్లి పిట్టలగూడెం నిత్యం ప్రజలతో కళకళలాడేది. ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని స్థానికంగా తోటల్లో సీతాఫలాలతో పాటు ఇతర పండ్లను పండించేవారు. కాల క్రమేణా ఇక్కడి నుంచి ఒక్కొక్కరుగా బయల్దేరి నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్థివాడలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. ఇక్కడి నుంచి వెళ్లిన వారు ప్రస్తుతం పాతబస్తీ పురానాపూల్, లాల్‌దర్వాజా, రాజన్నబావి, శంషీర్‌గంజ్, ఛత్రినాక హమాంబౌలి, డబీర్‌పురా, సరూర్‌నగర్, కాచిగూడ, అమీర్‌పేట, ఆబిడ్స్, బేగం బజార్, బోయిగూడ, చిక్కడపల్లి, ఎల్‌బీ నగర్, మొజంజాహి మార్కెట్, గన్‌ఫౌండ్రీ, వరంగల్, నిజామాబాద్, మెదక్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఇప్పటికీ ఆయా కుటుంబాల్లో ఎవరు మృతి చెందినా జల్‌పల్లి పిట్టల గూడెంకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తారు.

అలా పండ్ల వృత్తిలోకి..

ఉత్తరాది రాష్ట్రాల నుంచి నిజాం నవాబుల హయాంలో వలస వచ్చిన నక్కల పిట్టలోల్లు జల్‌పల్లి గ్రామ అటవీ ప్రాంతంలో కుందేళ్లు, పక్షుల వేట వృత్తిని కొనసాగిస్తూ జీవనం కొనసాగించేవారు. ఆ సమయంలోనే జల్‌పల్లి అడవికి వేట కోసం విచ్చేసిన నిజాం నవాబుకు ఈ తెగకు చెందిన అమీర్‌బాయి అనే యువతి తీయని ఫలాలను అందజేసింది. ఆ ఫలాలను ఆస్వాదించిన నిజాం నవాబు ఆ యువతి ప్రేమను సైతం కోరాడు. దీనికి ఆమె కూడా అంగీకరించిన నేపథ్యంలో అప్పటి నుంచి నిజాం నవాబుకు నక్కల పిట్టలోల్లు పండ్లను అందజేస్తూ పండ్ల వృత్తిని కొనసాగించారని కుల పెద్దలు చెబుతున్నారు. అమీర్‌బాయి స్నానం కోసం నిజాం నవాబుు కొలను తవ్వించి భూగర్భంలోనే రాతి కట్టడంతో స్నానాల గదులను నిర్మించాడు. 40 ఏళ్ల లోపే మృతి చెందిన అమీర్‌బాయిని కొలనుకు సమీపంలోనే ముస్లిం, పార్థిల సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేసి సమాధి నిర్మించారు. ఇక్కడే నక్కల పిట్టలోల్లు నివాసం ఉండేందుకు అప్పట్లో నిజాం నవాబు వందల ఎకరాల భూమిని ఇనామ్‌గా ఇచ్చారు. అప్పటి నుంచి ఏటా ఇక్కడ హోలీ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. హోలీ మరుసటి రోజు అమీర్‌బాయి సమాధి వద్ద ఈ కులస్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

తాతల కాలం నుంచి..



తాతల కాలం నుంచి పిట్టలగూడెంలో హోలీ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. హోలీకి మూడు రోజుల ముందే ఇంటిల్లిపాది విచ్చేసి గుడారాలు ఏర్పాటు చేసుకొని పూర్వీకుల సమాధులను అలంకరిస్తాం. అమీర్‌బాయి పేరు మీదే ఉత్సవాలు జరుగుతాయి.

– శక్తివాల శంకర్, పహాడీషరీఫ్

సదుపాయాలు కల్పిస్తాం



ఏడాదికోసారి నక్కల పిట్టలోల్లు జరుపుకొనే హోలీ వేడుకలను గౌరవిస్తాం. ఈ సందర్భంగా వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తాం. పారిశుద్ధ్యం, నీటి సదుపాయాల విషయమై ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బుడుమాల యాదగిరి, జల్‌పల్లి కౌన్సిలర్



పిట్టలగూడెంలో చదును పనులు



వేడుకల నిర్వహణ కోసం టెంట్లు

అభివృద్ధే ఎ‘జెండా’

జనం మధ్యే ఉన్నా.. జనం కోసమే పని చేశా

- అధికారంలో ఉన్న పార్టీతోనే అభివృద్ధి సాధ్యం
- అందుకే పార్టీ మారా .. అందరినీ కలుపుకొనివెళ్తా
- ఇప్పటికే ఎంతో చేశా.. మళ్లీ గెలిపిస్తే ఇంకా చేస్తా..
- ‘సాక్షి’తో కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ‘ఐదేళ్లు జనం మధ్యే ఉన్నా. వారి అభివృద్ధి కోసమే పని చేశా. సాంకేతిక కారణాలతో పలు అభివృద్ధి పనులు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. వాటికి శాశ్వత పరిష్కారం చూపించాలని భావించా. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం. లోక్‌సభ నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్యం కల్పనే లక్ష్యంగా పార్టీ మారా’ అని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

నా పనితనం నచ్చే నా వెంట

ప్రభుత్వ కాంట్రాక్టుల కోసం, పైరవీల కోసం పార్టీ మారలేదు. కేవలం నన్ను నమ్మి నాకు అండగా నిలిచిన ప్రజల సంక్షేమం కోసమే మారాను. నిత్యం వారికి అందు బాటులో ఉంటున్నా. ఆపదలో నా వద్దకు వచ్చిన వారికి పార్టీలకు అతీతంగా తగిన ఆర్థిక సాయం చేశా. ఎవరు.. ఎప్పుడు ఫోన్ చేసినా స్పందించా. నా పనితనం నచ్చే వారు నా వెంట నడుస్తున్నారు. నాపై వారికి ఉన్న అభిమానమే నన్ను మళ్లీ ఎంపీగా గెలిపిస్తుంది.

ప్రజలకు సేవ చేయాలనే..

వెటర్నరీ డాక్టర్‌గా ఎంతో గుర్తింపు పొందాను. పౌల్ట్రీ పరిశ్రమలను నెలకొల్పి ఆర్థికంగా ఎంతో ఎదిగా. ఏనాడు ప్రభుత్వ కాంట్రాక్టులు ఆశించలేదు. పైరవీల కోసం పార్టీ అధినేతల చుట్టూ తిరగలేదు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చా. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ భవిష్యత్తు ఇచ్చారు. ఐదేళ్లు నిజాయితీగా.. లోక్‌సభలో తెలంగాణ గొంతుకగా పని చేశా. పార్లమెంట్ సాక్షిగా 385 ప్రశ్నలు లేవనెత్తాను. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నావంతు ప్రయత్నం చేశా. నాకు నేనుగా పార్టీ మార లేదు. నా సేవలు, ప్రజల్లో నాకున్న మంచి పేరును గుర్తించే కాంగ్రెస్ అధిష్టానం పార్టీలోకి ఆహ్వానించింది. లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధి కోసమే పార్టీ మారాల్సి వచ్చింది. గత ఐదేళ్లలో వివాదాలకు దూరంగా ఉన్నా. ప్రజల మనసులో సుస్థిర స్థానం సంపాదించుకున్నా.

జీవో 111 రద్దుకు కృషి

జీవో 111 రద్దు వెనుక నా కృషిఎంతో ఉంది. నా ఒత్తిడి మేరకే గత ప్రభుత్వం జీఓను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. 84 గ్రామాల దశాబ్దాల కల నేరవేరింది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసుల కారణంగా సమస్య ఇప్పటికీ అలాగే అపరిష్కృతంగా ఉండిపోయింది. అధికారంలో ఉన్న ప్రభుత్వంతోనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అప్పాజంక్షన్‌నుంచి మన్నెగూడు వరకు 42 కిలోమీటర్ల వరకు నాలుగులేన్ల విస్తరణ కోసం రూ.1000 కోట్లు మంజూరు చేయించా. ఇప్పటికే భూ సేకరణ పూర్తయింది. ఎన్‌జీటీలో కేసులతో పనుల్లో కొంత జాప్యం చోటు చేసుకుంది. ఎంపీగా మళ్లీ అవకాశం కల్పిస్తే వచ్చే ఐదేళ్లలో పనులు పూర్తి చేయిస్తా. ఇందు కోసం గతంలో నన్ను నమ్మి నా వెంట నడిచిన కేడర్‌తో పాటు ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలోని కేడర్‌ను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తా.

చేయూతనిచ్చేందుకే చేతి పార్టీలోకి..

ఐదేళ్లలో ఎంపీగా అనేక అభివృద్ధి పనులు చేయించా. షాబాద్‌కు రూ.350 కోట్లతో కై టెక్స్, సింటెక్స్, వెల్‌స్పన్ వంటి సంస్థలను తీసుకురావడంలో నా కృషి ఎంతో ఉంది. సొంత నిధులతో ఏడు అంబులెన్స్‌లు కొని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గిఫ్ట్ ఏ స్మైల్ పథకం కింద అందజేశా. 104 మంది దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశా. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. 5,180 కోట్లు మంజూరు చేయించా. శంకర్‌పల్లిలో మేధా రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేయించి నా కెపాసిటీ, కాలిబర్, ఏంటో చూపించిన. శంషాబాద్, వికారాబాద్ మున్సిపాలిటీలకు రూ.110 కోట్ల చొప్పున మంజూరు చేయించా. గండిపేట లేక్ బ్యూటిఫికేషన్ కోసం రూ.100 కోట్లు విడుదల చేయించా. వికారాబాద్ ప్రజల దశాబ్దాల కల అయినటువంటి రైల్వే బ్రిడ్జి కోసం పోరాటం చేసి, రూ.110 కోట్లు నిధులు విడుదల చేయించా. చేవెళ్లలో బస్‌స్టేషన్ ఆధునికీకరణకు నిధులు విడుదల చేయించా. రూ.50 లక్షల సొంత నిధులతో చేవేళ్ల స్టేడియాన్ని అప్‌గ్రేడ్‌చేయించా. చేవెళ్లకు మరింత చేయూతనిచ్చేందుకు చేతి పార్టీతో చెలిమి చేస్తున్నా. వచ్చే ఎన్నికల్లో మళ్లీ నన్ను ఆశీర్వదిస్తారని నమ్ముతున్నా.

ఆగిన ‘ఇంటిగ్రేటెడ్’!



పునాది స్థాయిలో ఆగిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

పునాదుల దశలోనే సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణం

- రూ. 9కోట్లు మంజూరు చేసిన గత ప్రభుత్వం
- నాలుగు నెలలుగా సాగని పనులు
- రోడ్లపైనే కూరగాయల విక్రయం
- పాదచారులకు తప్పని తిప్పలు

తాండూరు: ప్రజలకు నిత్యావసర సరుకులన్నీ ఒకే చోట లభించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం తాండూరు పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత ఏడాది బెడ్డింగ్ పోసి పిల్లర్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ దశలో పనులు ఆగిపోయాయి. మార్కెటింగ్ శాఖ ఆధీనంలో ఉన్న స్థలాన్ని సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణం కోసం మున్సిపాలిటీకి బదలాయించారు. పనులు ప్రారంభించిన కొద్ది రోజులకే అసెంబ్లీ ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

నిరుపయోగంగా రైతుబజార్

రోడ్లపై కూరగాయల విక్రయించడం ద్వారా ఇటు వ్యాపారులు, అటు ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించిన గత ప్రభుత్వం రైతుబజార్ ఏర్పాటు చేయాలని భావించింది. 2017లో రూ.85 లక్షలతో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పాత పశువుల సంత ప్రాంగణంలో రైతుబజార్‌ను ఏర్పాటు చేసింది. నాటి రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి దీన్ని ప్రారంభించారు. అప్పట్లో మార్కెట్ కమిటీ అధికారులు రైతులు మాత్రమే కూరగాయలు విక్రయించాలని షరతు విధించారు. దీంతో కొన్ని రోజుల పాటు మార్కెట్ సజావుగా సాగినా ప్రజలు రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం రైతులు రోడ్ల పక్క, వీధుల్లో కూరగాయలను విక్రయిస్తున్నారు.



రోడ్డుపై కూరగాయల క్రయవిక్రయాలు

ఆగిన పనులు

తాండూరులో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవ చూపారు. ఇందు కోసం రూ.9కోట్లు మంజూరు చేయించారు. మార్కెటింగ్ శాఖ ఆధీనంలోని 5 ఎకరాల స్థలాన్ని మున్సిపాలిటీకి బదిలీ చేయించారు. అక్కడి గిడ్డంగులను కూల్చి పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో నిర్మాణాలు ఆగిపోయాయి.

రోడ్లపైనే విక్రయాలు

రైతుబజార్ వినియోగంలో లేకపోవడంతో రైతులు, వ్యాపారులు రోడ్లపైనే కూరగాయలు, పండ్లు, ఇతర సరుకులు విక్రయిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం పూట బస్వణ్ణకట్ట ప్రాంతంలో, మధ్యాహ్నం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద, వినాయక్ చౌక్ ప్రాంతాల్లో కూరగాయలు, పండ్లు, ఇతర సరుకులు విక్రయిస్తుంటారు. ఈ ప్రాంతాల్లో పాదచారుల రద్దీ కారణంగా వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు పనులను తాత్కాలికంగా ఆపేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పనులను తిరిగి ప్రారంభిస్తాం. రోడ్లపై విక్రయాల కారణంగా కొంత ఇబ్బంది ఉన్న మాట వాస్తవమే. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ప్రభాకర్, ఈఈ, మున్సిపల్ (పబ్లిక్ హెల్త్)



విద్యార్థులతో ముచ్చటిస్తున్న గురుకులాల ఓఎస్‌డీ సంతోషి తదితరులు

వేసవి శిబిరం అభినందనీయం

మొయినాబాద్ రూరల్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పూర్తయిన విద్యార్థులు సెలవు రోజుల్లో వృథాగా ఉండకుండా ప్రభుత్వం ద్వారా జీవన నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని సాంఘిక సంక్షేమ గురుకులాల ఓఎస్‌డీ బి.సంతోషి, రాష్ట్ర గురుకులాల సంస్థల కార్యదర్శి సీతాలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల చేవెళ్ల గురుకుల పాఠశాల, కళాశాలలో ‘స్పార్కిల్స్’ పేరిట నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా లైఫ్ స్కిల్స్, మొబైల్ యాప్స్, యంగ్ జర్నలిజం తదితర అంశాలపై ఇస్తున్న శిక్షణను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్ జార్జ్‌వార్కె, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల్లో చేసిందేమీ లేదు

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాదరణ కోల్పోతోంది
- కేసీఆర్ హయాంలోనే ప్రజలకు మేలు జరిగింది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

పరిగి: ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో చేసింది ఏమీ లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని ఎస్ గార్డెన్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంత మంది పార్టీని వీడినా వచ్చే నష్టమేమీ ఉండదన్నారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ బహుజన పక్షపాతి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 95 కులాలను ఏకతాటిపై తెచ్చిన గొప్ప నాయకుడు కొనియాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఆయన్ను తప్పక ఆశీర్వదిస్తారని అన్నారు. కాసానిని చట్టసభలకు పంపాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కాంగ్రెస్ పాలనను చూసిన ప్రజలు మోసపోయామని బాధపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కరువు కూడా వచ్చిందని గ్రామాల్లో చర్చ జరుగుతోందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రకటించిన అభ్యర్థులకు రాజకీయ భిక్ష పెట్టింది కేసీఆరే అని అన్నారు. రంజిత్‌రెడ్డి జిల్లా వాసి కాకపోయినా ఎంతో కష్టపడి ఎంపీగా గెలిపించామని పేర్కొన్నారు. ఆయన పార్టీ మారితే వచ్చే నష్టమంటూ ఏమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఎంతో ప్రజలే చూపిస్తారని పేర్కొన్నారు. మన జిల్లా వాసి సీఎంగా ఉన్నా ఏనాడైనా ఇక్కడి పరిస్థితుల గురించి మాట్లాడారా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కు మైక్ దొరికితే కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్ సీఎం అయ్యి వందరోజులు దాటినా హామీ అమలు కాలేదని ఆరోపించారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఒక్కసారి ఆశీర్వదించండి: కాసాని

నిత్యం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న తనను ఒక్కసారి ఆశీర్వదించి చట్టసభలకు పంపాలని బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో జెడ్పీ చైర్మన్‌గా ప్రజలకు సేవ చేశానని గుర్తు చేశారు. కేసీఆర్ ఆశీర్వాదంతో మీ ముందుకు వచ్చానని అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ వాణిశ్రీదేవి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కాసాని వీరేష్, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీలు హరిప్రియ, నాగిరెడ్డి, మేఘమాల, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యాపారి దుర్మరణం


శివశంకర్ (ఫైల్)

తాండూరు టౌన్: ఓ వ్యాపారి రైలు కిందపడి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన తాండూరు రైల్వే స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. పాత తాండూరుకు చెదిన కనకం శివశంకర్(46) పట్టణంలో అన్నదాత ఫర్టిలైజర్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఉదయం ఆయన హైదరాబాద్‌కు వెళ్లి ముంబాయి ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి తిరుగుప్రయాణమయ్యాడు. అర్ధరాత్రి 12గంటల సమయంలో రైలు తాండూరు చేరుకుంది. ప్లాట్‌ఫాంపై రైలు నిలుస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. దీంతో ఆయన శరీరం రెండు ముక్కలైంది. రైల్వే పోలీసులు కేసు నమో దు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించా రు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాండూరు రూరల్: ఐదుగురు పేకాటరాయుళ్లను శనివారం కరన్‌కోట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చంద్రవంచ గ్రామ శివారులో వాగు సమీపంలో పేకాడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వంచిన పోలీసులు బస్వరాజుగౌడ్, ఎడ్ల జగ్గప్ప, సూర్యకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. అంతారం రాజు, ఓగిపూర్ శరణప్ప పరారీలో ఉన్నారు. వీరి వద్ద రూ.11,560 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

విద్యార్థి మృతి కేసులో ఉపాధ్యాయుడు సస్పెండ్

ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్

నవాబుపేట: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతికి కారణమైన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయగా.. ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు అందజేసినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ గోపాల్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం సమీపంలో ఉపాధ్యాయులకు తాగునీరు(మినరల్‌వాటర్) తీసుకువచ్చేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో 9వ తరగతి విద్యార్థి కార్తీక్ మృతి చెందగా మరో విద్యార్థి వేణు గాయపడిన విషయం విదితమే. జిల్లా విద్యాధికారి ఆదేశానుసారం శనివారం ఉపాధ్యాయుడు బుచ్చిరెడ్డిని సస్పెండ్ చేసి.. హెచ్ఎంకు షోకాజ్ నోటీసులు అందజేసినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ గోపాల్ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


హన్మంత్‌రెడ్డి(ఫైల్)

మర్పల్లి: మనుమడితో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పంచలింగాల గ్రామానికి చెందిన అన్నం హన్మంత్‌రెడ్డి(74) ఫిబ్రవరి 27న మనుమడు మైపాల్‌రెడ్డితో కలిసి పొలానికి వెళ్లాడు. సాయంత్రం అవ్వడంతో మనుమడిని ఇంటికి వెళ్లమని పురమాయించాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికారు. హన్మంత్‌రెడ్డికి చెవుడుతో పాటు మాటలు రావని గతంలోనూ పలుమార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి వారం తర్వాత ఇంటికి వచ్చేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదృశ్యమైన వృద్ధుడు కోళ ముఖం, చామన ఛాయ రంగులో ఉంటాడని ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో తెలుపు రంగు పంచె, కమీస్, తలపై ఎర్రని రుమాలు ఉందని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు మర్పల్లి ఠాణాలో సమాచారంలో ఇవ్వాలని పోలీసులు కోరారు. మైపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

తాగు నీరు వృథా!


రైతు సేవా సహకార సంఘం వెనుక నిలిచిన తాగునీరు

పెద్దేముల్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఓ వైపు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా.. మండల స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పెద్దేముల్ మేజర్ పంచాయతీలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నాలుగు తాగునీటి ట్యాంకులు, నీటి నిల్వకు ఓ సంప్ ఏర్పాటు చేశారు. నాలుగు రోజులుగా సంప్‌తో పాటు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలోని ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారే లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటుగా మండల కార్యాలయానికి వ ఎళ్లే మార్గంలో 20 రోజుల క్రితం పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


సంపు లీకవడంతో పొలాలమీదుగా పారుతున్న తాగునీరు

ఈజీఎస్ పనులు వేగిరం

- టార్గెట్‌కు చేరువలో అభివృద్ధి పనులు
- ముందుచూపుతో పనుల పూర్తి
- ముగియనున్న ఆర్థిక సంవత్సరం


కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

వికారాబాద్: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆర్థిక సంవత్సరం చివరలో చేపట్టే పనుల్లో అధికారులు సక్సెస్ అయ్యారు. గత ఆర్థిక సంవత్సరం చివరలో ఉరుకులు పరుగులతో హడావుడి చేసే అధికారులు సగం పనులు కూడా పూర్తవ్వక నిధులు వెనక్కి వెళ్లేవి. ఈ ఏడాది కోడ్ ఎఫెక్టు అయితే మళ్లీ పనులు ప్రారంభించడం.. పూర్తి చేయడం కుదరదనే ముందుచూపుతో కలెక్టర్ ఈ పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. పనులు ముందుగానే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పనులు పూర్తి చేయటంలో సఫలమయ్యారు. మరో వారం రోజులు సమయం ఉండగానే దాదాపు పనులు పూర్తి చేయడంలో అధికారులు విజయం సాధించారు.

ఎన్నికల కోడ్‌కు ముందే పనుల ప్రారంభం

మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా మెటీరియల్ కంపోనెంట్ కింద రెండు నెలల క్రితం ప్రభుత్వం జిల్లాకు 799 సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు మంజూరు చేసింది. ఇందుకు రూ.60.73 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ పనులన్నీ ఎన్నికల కోడ్ రాకముందే ప్రారంభించడంతో పాటు మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలనే నిబంధనలు విధించారు. ఏడాది చివరలో పనుల మంజూరు చేసిన ఉరుకులు పరుగులు పెట్టిస్తే నాణ్యత ఏమేరకు పాటిస్తారనేది ప్రశ్నార్థకంగా మారిన తరుణంలో అధికారులు వేగంగా పనులు చేపట్టారు. ఇప్పటికే 785 పనులు పూర్తి చేశారు. మరో 14 పనులు పూర్తి కానప్పటికీ అవి కూడా ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. పూర్తైన పనులకు సంబంధించి రూ.36.80 కోట్ల పనులకు బిల్లులు ఆన్‌లైన్‌లో జనరేట్ చేశారు.

నాణ్యత ప్రశ్నార్థకం

జిల్లాలో ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏడాదంతా ఉపాధి హామీ పనులు నిర్వహించగా లేబర్ కాంపోనెంట్‌కు దీటుగా మెటీరియల్ కాంపోనెంట్ పనులు ముందుగానే మంజూరు చేయకుండా ఏడాది చివరలో మంజూరు చేస్తూ వస్తున్నారు. దీంతో పనుల నిర్వహణలో హడావుడి చేయాల్సి వస్తోంది. కాగా ఇంత త్వరగా పనులు పూర్తి చేయడంతో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. గడువు తక్కువగా ఉండడం.. అధికారులు, ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.

ఉపాధి హామీ నిధుల వివరాలు	
జిల్లాకు మంజూరైన పనులు	799
ఖర్చు చేయాల్సిన లక్ష్యం	రూ.60.73 కోట్లు
పూర్తైన పనులు	785
పెండింగ్ పనులు	14
ఆన్‌లైన్‌లో జనరేట్ అయిన బిల్లులు	రూ.36.80 కోట్లు

నాణ్యతలో రాజీపడం

పనులు నిర్వహించడంలో హడావుడి వాస్తవమే.. అయినప్పటికీ ప్రత్యేక ఫోకస్ పెట్టి పనులు పూర్తి చేస్తున్నాం. ఇప్పటి వరకు చాలా పనులు పూర్తయ్యాయి. మిగిలన పనులు త్వరితగతిన పూర్తి చేయించేలా చూస్తాం. ఇంజనీరింగ్ పరంగా పాటించాల్సిన అన్ని నిబంధనలు పాటిస్తున్నాం. నాణ్యత విషయంలో రాజీ ఉండదు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– ఉమేశ్, ఈఈ పీఆర్, వికారాబాద్

రైలులో తరలిస్తున్న మద్యం సీజ్


అనంతగిరి: పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు


పరిగి: పోలీసులు సీజ్ చేసిన నగదు

అనంతగిరి: రైల్‌లో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆర్‌పీఎఫ్, ఎక్సైజ్, జీఆర్‌పీ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం పక్కా సమాచారంతో గోవా నుంచి జైసిద్ వెళ్లే వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్‌లో రెండు బ్యాగుల్లో అక్రమంగా మద్యం తరలిస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సామూహిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 50 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దాడులను గమనించిన వ్యక్తులు బ్యాగులు వదిలి పారిపోయారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్‌పీఎఫ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్, సీసీఎస్ సీఐ వెంకటేశం, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రేం కుమార్‌రెడ్డి, జీఆర్‌పీ ఎస్ఐ శంకరయ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.6.54లక్షలు..

పరిగి: ఎన్నికల కోడ్ నేపథ్యంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.6.54లక్షల నగదు సీజ్ చేశారు. ఎస్ఐ సంతోశ్ కుమార్ తెలిపిన ప్రకారం శుక్రవారం రాత్రి చేపట్టిన తనిఖీల్లో హీరా మసాలా వాహనంలో రూ.6,54,660 నగదు పట్టుబడింది. ఇందుకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేక పోవడంతో సీజ్ చేశామన్నారు. నగదు తీసుకెళ్లే వారు సంబంధిత పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఎస్‌ఐకి తప్పిన ముప్పే

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


రోడ్డు పక్కకు దూసుకెళ్లిన వాహనం

బంట్వారం: పోలీస్ వాహనం టైరు పేలడంతో ఎస్ఐ, డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం బంట్వారం శివారులో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. వికారాబాద్ పోలీస్ సబ్‌డివిజన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బంట్వారం ఎస్ఐ శ్రీశైలం పలువురు విద్యార్థులను రక్తదాన శిబిరానికి తరలించారు. తిరుగు ప్రయాణంలో ఇన్నోవా వాహనం ఎడమ వైపు టైర్ పేలడంతో వాహనం అదుపు తప్పి రోడ్డుకు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎస్ఐ శ్రీశైలం, డ్రైవర్ దస్తగిరి స్వల్పంగా గాయపడ్డారు.

బెల్ట్ షాపులపై కొరడా



పహాడీషరీఫ్: పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులపై యాచారం పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సీఐ శంకర్‌కుమార్ ఆధ్వర్యంలో కొత్తపల్లి, నందివనపర్తి, తమ్మలోనిగూడ తదితర గ్రామాల్లోని దాడులు నిర్వహించి సుమారు రూ.12వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రూ.46 వేల విలువైన మద్యం సీజ్

పహాడీషరీఫ్: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. రావిర్యాల గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ కారులో మద్యం తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. మేరకు ఎస్‌ఓటీ ఎస్ఐ రాజు బృందం తుక్కుగూడలో కారును ఆపి తనిఖీలు నిర్వహించారు. రూ.46 వేల విలువైన 80.096 లీటర్ల క్వార్టర్ బాటిళ్లు, బీర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేడు అవగాహన సదస్సు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ఏకేఆర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10గంటలకు టెట్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్‌కు ఎలా సన్నద్ధం కావాలి, సిలబస్, తెలుసుకోవాల్సిన మెళుకువలను వివరించనున్నట్లు తెలిపారు. టెట్ రాసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆటోడ్రైవర్‌ను చితకబాదిన వ్యక్తి అరెస్ట్

తాండూరు టౌన్: ఆటో డ్రైవర్‌ను చితక బాదిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ సంతోశ్ కుమార్ తెలిపిన ప్రకారం.. రాజీవ్‌గృహకల్పకు చెందిన ఆటో డ్రైవర్ బాలయ్యకు గాంధీనగర్‌కు చెందిన మ్యాతరి రవికి డబ్బుల విషయంలో గొడవ జరిగింది. ఫిబ్రవరి 25న బాలయ్యపై రవి దాడిచేసి విచక్షణ రహితంగా కొట్టాడు. ఈ గొడవకు సంబంధించిన వీడియో శనివారం బహిర్గతమైంది. ఆటో డ్రైవర్ బాలయ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రవిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

రెండు లారీలకు రూ.25వేల జరిమానా

తాండూరు రూరల్: ఓవర్‌లోడ్ వాహనాలను కరన్‌కోట్ పోలీసులు తనిఖీలు చేశారు.శశనివారం తాండూరు– చించోళి–కరన్‌కోట్ ప్రధాన రోడ్లపై పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా ఓవర్‌లోడ్‌తో ఎర్రమట్టి, సిమెంట్‌ను తరలిస్తున్నారు. ఆరు లారీలను పట్టుకుని ఆర్టీఏ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇందులో రెండు లారీలకు రూ.25 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. మరో నాలుగు వాహ నాలకు సైతం జరిమానా విధిస్తామని తెలిపారు.

కబ్జాకు పాల్పడితే చర్యలు

తుర్కయంజాల్: చెరువులు, కుంటల కబ్జాకు యత్నిస్తే చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం డివిజన్ ఇరిగేషన్ డీఈ ఉషారాణి హెచ్చరించారు. శనివారం మున్సిపల్ పరిధి ఇంజాపూర్‌లోని గుడెంకుంటలో అక్రమంగా నిర్మించిన ప్రీకాస్ట్ నిర్మాణాలను తొలగించారు. ఇంజాపూర్ రెవెన్యూ సర్వే నంబర్లు 96, 99, 100లోని 15.22 ఎకరాల్లో కుంట విస్తరించి ఉంది. రియల్ వ్యాపారులు ఈ కుంటను ప్లాట్లుగా మార్చి అమాయకులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఇటీవల ప్లాట్లకు ప్రీకాస్ట్ ఏర్పాటు చేసి ఇంటి నిర్మాణాలు రారంభించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ మున్సిపాలిటీ నుంచి అనుమతులు మంజూరు చేయడం వివాదానికి దారితీసిన విషయం విదితమే. ఆక్రమణలను తొలగించాలని కోర్టు నుంచి ఉత్తర్వులు ఉండటంతో కూల్చివేతలు చేపట్టారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ రజతాప్రీస్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల చోరీ


దుండగులు చోరీకి పాల్పడిన లక్ష్మీనృసింహస్వామి ఆలయం ఇదే..

ఇబ్రహీంపట్నం: పురాతన లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు పంచలోహ విగ్రహాలు చోరీ చేశారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పోచారం సమీపంలోని నృసింహస్వామి ఆలయంలో రూ.లక్ష విలువ చేసే పంచలోహ విగ్రహాలను అపహరించుకుపోయారు. ఆలయ పరిసరాల్లోనే తాళం చెవి ఉండడంతో తాళాలు పగులగొట్టకుండానే విగ్రహాలు దొంగిలించారు. సమాచారం అందుకున్న ఏసీపీ కేవీపీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మారయ్య ఘటనాస్థలిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. ఆలయ చైర్మన్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇందిరమ్మ కమిటీల్లో విశ్వకర్మలకు స్థానం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

- కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రిని కలుస్తా
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: నియోజకవర్గంలోని విశ్వకర్మలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఖాంజాపూర్ గుట్ట వద్ద విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో తన విజయానికి అండగా ఉన్న విశ్వకర్మల ఎదుగుదలకు సహకరిస్తానన్నారు. విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే ఇందిరమ్మ కమిటీల్లోనూ విశ్వకర్మలకు స్థానం కల్పిస్తానన్నారు. బ్రహ్మంగారి గుట్ట నిర్మాణానికి తనవంతు ఆర్థికసాయం చేస్తానన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. తాండూరులో టాటా కన్సల్టెన్సీ సంస్థ సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ఇందులోనూ విశ్వకర్మలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పేద విశ్వకర్మలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్, పెద్దేముల్ వైస్ ఎంపీపీ మధులత, విశ్వకర్మ సంఘం సలహాదారు కరణం పురుషోత్తంరావు, నాయకులు గద్దె శ్రీనివాస్‌చారి, పులేందర్‌చారి, తిప్పన్నచారి, ఆనంద్‌చారి, పరమేష్‌చారి, ఎల్ఐసీ శ్రీనివాస్‌చారి, లక్ష్మణాచారి, రఘుచారి, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఈఎంఐ వేధింపులతో ఆత్మహత్యాయత్నం

బాధితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


రవిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: తీసుకున్న రుణానికి వాయిదా చెల్లించాలంటూ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వేధింపులతో బాధితుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలం, చిన్నరేవల్లి పంచాయతీ పరిధిలోని పెద్దచెల్మతండాకు చెందిన రవి ఆరు నెలల క్రితం ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో ఇల్లు తాకట్టు పెట్టి రూ.4లక్షల రుణం తీసుకున్నాడు. ఇందుకు ప్రతీ నెల 20న రూ.9,806 వాయిదా చెల్లిస్తున్నాడు. ఈ నెల వాయిదా చెల్లించకపోవడంతో ఆ కంపెనీకి చెందిన వారు ఇంటికి వచ్చారు. రవి లేక పోవడంతో భార్యను వాయిదా చెల్లించాలని కోరారు. లేదంటే ఇక్కడ నుంచి వెల్లమని భీష్మించుకున్నారు. ఇంటి చుట్టుపక్కల వారికి అప్పు విషయం చెప్పారు. దీంతో అవమానంగా భావించిన రవి భార్య భర్త వచ్చాక విషయం చెప్పింది. దీంతో బాధితుడు సదరు కంపెనీకి వెళ్లి తరువాత చెల్లిస్తానని చెప్పినా ఇంటికి వచ్చి పరువు తీస్తారా అని ఫైనాన్స్ వారిని ప్రశ్నించాడు. దీంతో వాగ్వాదం జరిగి కంపెనీ వారు రవిని కార్యాలయం నుంచి కిందికి తోసుకుంటూ వచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన రవి ఆత్మహత్య చేసుకుంటానని కార్యాలయం వద్ద పెట్రోల్ బాటిల్‌తో ఆందోళనకు దిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రవిని అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు సదరు ఫైనాన్స్ కంపెనీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

గంజాయి విక్రేతకు రిమాండ్


చంద్రవమ్‌బిందు

ఇబ్రహీంపట్నం: గంజాయి విక్రయిస్తున్న వృద్ధుడిని పోలీసులు అరెస్టు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మైబెల్లి తెలిపిన ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన చంద్రవమ్‌బిందు(64) లేబర్ పనులు చేస్తూ ఇబ్రహీంపట్నంలోని శ్రీరాంనగర్ కాలనీ వెనుక రేకుల ఇంట్లో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మహేశ్వరం ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేసి సుమారు 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వృద్ధుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

భగత్‌సింగ్ వారసత్వాన్ని కొనసాగిద్దాం

ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆమంచి నాగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ ఆమంచి నాగేశ్వర్

షాద్‌నగర్‌రూరల్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన షహీద్ భగత్‌సింగ్ వారసత్వాన్ని కొనసాగిద్దామని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు ప్రొఫెసర్ డాక్టర్ ఆమంచి నాగేశ్వర్ పిలుపునిచ్చారు. షహీద్‌భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్వాతంత్ర్య పోరాటంలో అమరత్వం పొందిన రోజును పురస్కరించుకొని శనివారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో టీఎస్‌యూటీఎఫ్, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా 'స్వతంత్ర భారతం–వర్తమాన అంశాలు' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ ఆమంచి నాగేశ్వర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యంకోసం ప్రాణాలకు తెగించి పోరాడిన వాళ్లలో షహీద్ భగత్‌సింగ్ పోరాటం అజరామరమని అన్నారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు ఆశయాలను కొనసాగించడమే మన ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. 1955 పౌరసత్వ చట్టానికి 2023 సవరణలు తెచ్చి దానికి మతం రంగు రుద్ది రాజకీయంగా వాడుకొని లబ్ధి పొందడానికి చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వాటిని అడ్డుకొని రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ.. జాతీయ విద్యావిధానం 2020లో అంతరించిపోయిన సంస్కృతం నేర్పించి ఆధిపత్య సంస్కృతిని సుస్థిరం చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని అన్నారు. కార్పొరేట్ విద్య, కేంద్రీకరణ విద్య, కాషాయ విద్యను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఎన్ఈపీ 2020 విద్యావిధానంతో విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకుడు సుధాకర్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు రాజు, శ్రీనునాయక్, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వెంకటప్ప, గోపాల్‌నాయక్, కృష్ణయ్య, వెంకటయ్య, శివారెడ్డి, నర్సింలుగౌడ్, శేఖర్‌గౌడ్, కృష్ణ, చంద్రశేఖర్, బాలయ్య, అరుణ, సమత, కళావతి, జ్ఞానేశ్వరి, సీఎల్‌సీ నాయకులు తిరుమలయ్య, అర్జునప్ప తదితరులు పాల్గొన్నారు.